క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు, మాజీ ఎంపీపీ సారయ్యా గౌడ్ నేతృత్వంలో మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కేంద్రానికి చెందిన పులి ఇంద్రకరణ్(బాజీ)రెడ్డి, గీట్ల రవీందర్ రెడ్డి, రానవేన క్రాంతి, పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.కార్యక్రమంలో పందిల్ల ఎంపీటీసీ రావి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మునీర్, పెగడపల్లి సర్పంచ్ ఆరెల్లి సుజాత, నాయకులు సతీశ్, సదయ్యా, లావణ్య, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీ టీమ్



అవగాహన కల్పిస్తున్న సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ: మహిళల భద్రత కోసం షీ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని టూ టౌన్ సీఐ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం యైటింక్లయిన్‌కాలనీ సంతోష్ నగర్ ఏరియాలోని పాలకుర్తి కేజీబీవీలో విద్యార్థినులకు షీ టీమ్ పై అవగాహన కల్పించారు. చిన్న పిల్లలను ఎవరైనా వేధించినా.. ఒత్తిడికి గురి చేసిన షీ టీమ్ వారికి, లేదా 100 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినులు సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు సెల్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై శ్యామ్ పటేల్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సీఐ సతీశ్

మంథని: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలని మంథని సీఐ సతీశ్ సూచించారు. మంగళవారంతో పదో తరగతి పరీక్షలు ముగిసిన సందర్భంగా మంథని సర్కిల్ పరిధిలోని ఆయా మండలాల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం, బాలికలకు మహిళల రక్షణ గురించి ప్రభుత్వం ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. కష్టపడి చదవాల్సిన సమయంలో డ్రగ్స్, గంజాయి, ఇతర చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాణి, రవిప్రసాద్, దివ్య, రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మ

గోదావరిఖని: వేసవికాలంలో ఎండదెబ్బ తగలకుండా సింగరేణి ఉద్యోగులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ అధికారి డాక్టర్ పద్మ అన్నారు. మంగళవారం ఓసీపీ–1 బేస్ వర్క్ షాప్‌లో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉద్యోగులు క్రమం తప్పకుండా మంచినీటిని ఎక్కువగా తీసుకోవాలన్నారు. నీటి శాతం ఎక్కువగా ఉన్న కూరగాయలు, పండ్లు తినాలన్నారు. లేత రంగు దుస్తులు ధరించాలని, విధులకు హాజరయ్యే సమయంలో వడ గాల్పుల నుంచి రక్షణ పొందేందుకు హెల్మెట్ లేదా రుమాలు ధరించాలన్నారు. షుగర్, బీపీ లాంటి సమస్యలు కలిగిన వారు సకాలంలో మందులు వాడుతూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాస్ గారు, గని మేనేజర్ ఉదయ్ హరిజన్, పిట్ సెక్రటరీ వేగోలపు మల్లయ్య పాల్గొన్నారు.

జ్యోతిబాపూలేకు ఘన నివాళి

మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, మంథని, రామగుండం నియోజకవర్గ కేంద్రాలు, గోదావరిఖని, సుల్తానాబాద్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీల కార్యాలయాల్లో పూలే చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెనకబడిన బడుగు, బలహీన వర్గాల హక్కులు, మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ,బీసీల సంఘాల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సెంటినరీకాలనీలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



సుల్తానాబాద్‌లో నివాళి అర్పిస్తున్న విజయరమణారావు



గోదావరిఖనిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి నివాళులు



పూలే విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నివాళి అర్పిస్తున్న సోమారపు లావణ్య



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు



ఎలిగేడులో నివాళి అర్పిస్తున్న నాయకులు

మానవతా విలువలతో కూడిన విద్య

సుల్తానాబాద్: మానవతా విలువలతో కూడిన విద్య అవసరం అని ఇంటర్నేషనల్ ట్రైనర్ డాక్టర్ లక్ష్మీమూర్తి అన్నారు. పట్టణంలోని ట్రినిటీ విద్యాసంస్థలు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 ఎలైట్ ఆధ్వర్యంలో ట్రినిటీ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు 30 మందికి రెండు రోజులపాటు నిర్వహించిన టీచర్ ట్రైనింగ్ వర్క్ షాప్ శిక్షణ ముగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనుమండ్ల రాజిరెడ్డి, డిస్టిక్ గవర్నర్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్వీస్ ప్రాజెక్ట్ దోహదపడుతుందని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఒక్కొక్కరు 30 మంది విద్యార్థులను ఎంచుకుని నవ సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించే విధంగా తయారు చేయడానికి కార్యక్రమం రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి, అధ్యక్షుడు సంపత్ రావు లింగారావు, బిక్షపతి, పిట్ట వెంకటేష్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

16న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ధర్మారం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6 వ తరగతి నుంచి పదో తరగతికి ప్రవేశ పరీక్ష ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ మన్నె దీనా తెలిపారు. విద్యార్థులు మీసేవాలో హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్‌కార్డుతో పరీక్ష కేంద్రానికి రావాలని ఆమె సూచించారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 7 వ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశపరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుందని ఆమె తెలిపారు. విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వెలుగు

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



కంటి పరీక్షలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ: దృష్టి లోపాలు, అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. మంగళవారం స్థానిక 34వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జంజర్లమౌనిక, జే.వి.రాజు, దొంత శ్రీనివాస్, వైద్యురాలు నర్మద, నాయకులు దొమ్మెటి వాసు పాల్గొన్నారు.

అణగారినవర్గాల అభ్యున్నతికి పూలే పోరాటం

గోదావరిఖని: అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జ్యోతిరావు పూలే పోరాటం చేశారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మహనీయుల జయంతోత్సవ కమిటీఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాజేశ్ టాకీస్ సమీపంలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏసీపీ గిరిప్రసాద్, మున్సిపల్ కమీషనర్ సుమన్‌రావు, రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, మధ్యప్రదేశ్ ప్రభుత్వ కార్యదర్శి పరికిపండ్ల నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

గోదావరిఖని: స్థానిక విఠల్‌నగర్ మజీద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ముస్లింలకు పండ్లు తినిపించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు రఫీక్, నాయకులు పర్లపల్లి రవి, జాహిద్‌పాషా, జెవీరాజు, దొమ్మేటి వాసు, మజీద్ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న నాయకులు

జూలపల్లి: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో «పది» తరువాత ఏ కోర్సులు చదవాలి అనే పుస్తకాలను జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ సహకారంతో సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అమరగాని శ్రీనివాస్ గౌడ్, సభ్యులు మానుమండ్ల సంపత్,తుమ్మరాజు, రాజలింగం,తదితరులు ఉన్నారు.

ఎలిగేడు: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నతపాఠశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు కేసీఆర్ సేవాధళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ పంపించిన పుస్తకాలను కేసీఆర్‌సేవాదళం నాయకులు పంపిణీ చేశారు.ర్యక్రమంలో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధానకార్యదర్శి చాతల్ల కాంతయ్య, బొద్దుల సాయినాథ్, మండల అధ్యక్షుడు బింగి రాజు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పదో తరగతి విద్యార్థులకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం నాయకులు బొద్దుల వెంకన్న, చిప్ప శ్రీకాంత్, చిప్ప వెంకటేశం పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌కు మెరుగైన వైద్యం అందించాలి



బాధితున్ని పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో విధి నిర్వహణలో విద్యుత్ ప్రమాదానికి గురైన వివేక్ అనే ఔట్‌సోర్సింగ్ ఎలక్ట్రీషియన్‌కు అధికారులు మెరుగైన ఉచిత వైద్యాన్ని అందించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దెల దినేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తోడుపునూరి రమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు వివేక్‌ను వారు పరామర్శించారు. ప్రమాదానికి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

చెక్కులు పంపిణీ

రామగిరి: ముత్తారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మెట్టు ఓదమ్మకు రూ. లక్ష, ఓడ్నాల మానసకు రూ. 39వేలు, ఎడ్ల ఓదెమ్మకు రూ. 28వేలు, నిమ్మతి నాగరాజుకు రూ. 25వేల చెక్కులు మంజూరు కాగా, లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు అశోక్, బైరి రాజు, లక్కం ప్రభాకర్, పాల్గొన్నారు.

ముగిసిన ‘పది’ పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాలలోని ప్రభుత్వ,ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులకు నేటితో పరీక్షలు ముగిశాయి. జూలపల్లిలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా బాలికల ఉన్నత పాఠశాలలో 164, బాలుర ఉన్నత పాఠశాలలో 118 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్లు జీవన్ రెడ్డి,సరస్వతి, డీవోలు లచ్చయ్య, రమణయ్య పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల ఆట పాటలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఓదెల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినుల వీడ్కోలు సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆటపాటలు, డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌వో మాధవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి

సుల్తానాబాద్ : అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పార్టీలకతీతంగా జయప్రదం చేయాలని అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి అన్నారు. మంగళవారం సుల్తానాబాద్‌లో మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీన ఏర్పాటు చేశామని, అత్యధిక మంది తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. జయంతోత్సవ కార్యక్రమం పూర్తిగా అధికారికంగా నిర్వహిస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నేతృత్వంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాతరి ప్రభాకర్, మంథని రమేశ్, ఆరేపల్లి ఇలా రావు, న్యాతరి శ్రీనివాస్, చుక్క రాజమౌళి పాల్గొన్నారు.

‘దళితబంధు’ ఉపకులాలకు వర్తింపజేయాలి

కాల్వశ్రీరాంపూర్: దళితబంధు పథకాన్ని మాదిగ ఉప కులాలకూ వర్తింపజేయాలని ఉప కులాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశ్ కోరారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కళాప్రదర్శనలో కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన మాస్టి కళాకారులను ఆయన సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దంతెనపెల్లి ధర్మయ్య మాట్లాడుతూ దళితబంధును అందరికీ వర్తింపజేయాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. మాస్టి సంఘం రాష్ట్ర కన్వీనర్ చిన్నస్వామి, నాయకులు రాజశేకర్, సమ్మయ్య,స్వామి పాల్గొన్నారు.

తై బజారు వేలం రూ.3.8 లక్షలు

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామపంచాయతీ తైబజారు వేలంను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అల్లం పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలం పాట పోటాపోటీగా సాగగా నాగరాజు రూ.3.87లక్షలకు పాట పాడి తై జజారు కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిందం మహేశ్, ఎంపీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ఆకాశ్, పాల్గొన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

రామగిరి: ఈనెల 13వ తేదీన పెద్దపల్లి నందన గార్డెన్‌లో నిర్వహించే గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవానికి మండలంలోని యాదవ సోదరులు హాజరై విజవంతం చేయాలని ముత్తారం మండల గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కాసు తిరుపతి యాదవ్, ప్రధాన కార్యదర్శి చెల్కల యుగేందర్ యాదవ్ కోరారు. మంగళవారం మండలంలోని హరిపురంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల ఆరాధ్యదైవం బీపీ మండల్ విగ్రహానిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు చెనవేన కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఏగుర్ల కుమార్ యాదవ్, యూత్ అధ్యక్షుడు ఏగుర్ల రాజు యాదవ్, ప్రధాన కార్యదర్శి చెనవేన సంతోష్ యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేరాఫ్ తెలంగాణ

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్: అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు కేరాఫ్ తెలంగాణ రాష్ట్రమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కిష్టంపేటలో రూ.11 లక్షల నిధులతో పూర్తి చేసిన ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల సముదాయన్ని, సీసీరోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు, మహిళా స్వశక్తి గ్రూపులు, దళితులు, యాదవులు, మత్స్యకార్మికులు, చేనేత కార్మికులు, ముస్లింలు, వృద్ధులు, ఒంటరి మహిళలు అన్ని వర్గాల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేస్తూ దేశానికే సీఎం కేసీఆర్ ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని అన్నారు. ప్రత్యేక గ్రామ పంచాయతీలతో పల్లెలు అభివృద్ధిలో పోటీ పడుతున్నాయని జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులు రావడమే అందుకు నిదర్శనమన్నారు. చిన్నరాతుపల్లి మొట్లపల్లి, కిష్టంపేట, మీర్జంపేట ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతు పనులు త్వరలో చేపట్టనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి రెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, పంచాయతీ పాలకవర్గం, ఉపాధ్యాయులు, మహిళలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గొర్ల కాపరుల సంఘం మండల అధ్యక్షుడిగా భూమయ్య

సుల్తానాబాద్: గొర్ల కాపరుల సంఘం మండల అధ్యక్షుడిగా సుల్తానాబాద్‌కు చెందిన అమ్ముల భూమయ్య యాదవ్ గెలుపొందారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ఎన్నికల్లో అసరి రాయమల్లుపై భూమయ్య గెలుపొందారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ గొర్ల కాపరుల సంఘం అభివృద్ధి కోసం అందరిని కలుపుకుని పోతానని, ప్రభుత్వంతో సంఘానికి రావలసిన పథకాలను తీసుకొస్తానని, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో సంఘ అభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు. భూమన్నను పలువురు ఘనంగా సన్మానించారు.

హోమియోపతి మందులు పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఎస్‌ఎంఎస్ ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికులకు మంగళవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హోమియో డాక్టర్ రమేశ్ బాబు సహకారంతో ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నూక రమేశ్ వడదెబ్బ నివారణ కోసం హోమియోపతి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు శరవణ్, అరుణ్ కుమార్, మల్లేష్, సంతో రెడ్డి, శ్రీనివాస్ రావు, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

సుల్తానాబాద్‌రూరల్:పెద్దపల్లి జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయతీగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి అవార్డు పొందిన సందర్భంగా మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పాలవర్గాన్ని సన్మానించారు. సర్పంచ్ వీరగోని సుజాత, ఎంపీటీసీ పులి అనూష, కార్యదర్శి ప్రశాంత్, వార్డు సభ్యులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి అవుదుర్తి శ్రీనివాస్, తిరుపతి, సంపత్, కుమార స్వామి, రవి పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబమే బలగం

సుల్తానాబాద్: ఉమ్మడి కుటుంబమే తమ బలగమని సినిమాతో ప్రజల మార్పు వస్తున్నదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు కాలనీలో మంగళవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. కుటుంబ విలువుల, సంప్రదాయాలు కాపాడుకోవాలని పలువురు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఊట్ల వరప్రసాద్, చింతల సునీత, రాజు,కుమార్ యాదవ్ బీజేపీ నాయకులు పల్లె తిరుపతి యాదవ్ పలువురు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

రామగిరి: ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సర్పంచ్ పల్లె ప్రతిమ కోరారు. రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధి రాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసి మాట్లాడారు. రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రానికి పూర్తిస్థాయిలో ఆదరణ లభించిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పర్కాల శారద, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. మండలంలోని గట్టెపల్లిలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణజ్యోతి, ఎంపీటీసీ శంకర్, తదితరులున్నారు.

దివ్యాంగుల ఉపకరణాలకు 25 లోగా దరఖాస్తు చేసుకోవాలి

రామగిరి: మండలంలోని దివ్యాంగులు ఉపకరణాలు పొందడానికి ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఇనుముల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

కస్తూర్బా జయంతి వేడుకలు

రామగిరి: సెంటనరీకాలనీలోని రామగిరి కస్తూర్బా పాఠశాలలో మంగళవారం కస్తూర్బా జయంతి వేడుకలను సెంటనరీకాలనీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్, డైరెక్టర్లు ,ఎస్‌వో మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని కంఫర్ట్ పాఠశాలలో మంగళవారం వైద్య సిబ్బంది విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలను చేశారు.కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్‌కుమార్, సిబ్బంది శారద, రజీనా, పురుషోత్తం,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ర్యాకల్‌దేవుపల్లిలో కంటి వెలుగు

ఎలిగేడు: మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో బుధవారం నుండి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాదరణ ఓర్వలేక పార్లమెంట్ సభ్యత్వం రద్దు



మాట్లాడుతున్న గజ్జెల స్వామి

ధర్మారం: దేశంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిందని ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజ్జెల స్వామి ఆరోపించారు. ధర్మారంలో మంగళవారం మాట్లాడారు. పార్లమెంట్ సభ్యత్వం రద్దుకు నిరసనగా ఈ నెల 14న మంచిర్యాలలో చేపట్టిన ఒక్క రోజు సత్యాగ్రహ దీక్షకు నియోజకవర్గ ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరవుతున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలను తరలిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, బొల్లి స్వామి, నాయకులు తుమ్మల తిరుపతి, సంతోష్, మెడవేని హరీష్, ఈదుల శ్రీనివాస్, కరాటే వేణు పాల్గొన్నారు.